# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పాకిస్థాన్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.**
2. **వచ్చే నెల 2వ తేదీన జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు.**
3. **140 కోట్ల మంది భారతీయులు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.**
4. **ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సారథ్యంలో పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి పథంలో కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో 'మత్స్యకారులకు చేయూత' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రారంభిస్తారు.**

==========================

పాకిస్థాన్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన నిన్న మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సార్క్ వీసా పొడిగింపు పథకం కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైద్య సంబంధిత వీసాలు పొందిన వారికి మాత్రం ఈ నెల 29వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

--------------------------

పహల్గాం ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిన్న ఆయన ఢిల్లీలో సమావేశమయ్యారు. వచ్చే నెల 2వ తేదీ అమరావతి పునఃప్రారంభ పనులకు ప్రధానమంత్రిని చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మించేందుకు ప్రధానమంత్రి దూరదృష్టితో కూడిన సూచనలు చేశారని, వాటిని అమలు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అమరావతి మరోసారి ప్రారంభం కాబోతోందని, ప్రజా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు.

--------------------------

140 కోట్ల మంది భారతీయులు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో నిన్న రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి పథంలో కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు నిన్న ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా పని చేస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా.. పార్టీతో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హెచ్చరిస్తూ...

...వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో 'మత్స్యకారులకు చేయూత' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు. సముద్రంలో వేటకు విరామం సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం కింద 20 వేల రూపాయల చొప్పున అందజేయనున్నారు. లక్షా 29 వేల 178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూర్చే ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం 258 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది.

---------------------------

తలసేమియా బాధితుల కోసం వచ్చే నెల 8వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రామకృష్ణ బీచ్ రోడ్డులో 3కె, 5కె, 10కె రన్ నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఓ గొప్ప లక్ష్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో పాల్గొని తలసేమియా బాధితులకు అండగా ఉంటామన్న భరోసా కల్పిద్దామని భువనేశ్వరి కోరుతూ...

..వాయిస్ ... 30 సెకన్లు....

---------------------------

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్' నిన్న ఘనంగా ప్రారంభమైంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి తరలివచ్చిన ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు.

కాగా.. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు తక్షణమే తమ దేశానికి వెళ్లిపోవాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థానీయులకు వీసాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని, ఇప్పటికే వీసాలు పొందిన వారికి రేపటి వరకు గడువు ఉందని పేర్కొన్నారు. మెడికల్ వీసాలపై వచ్చిన వారికి ఈ నెల 29వ తేదీ వరకు అనుమతి ఉందన్న డీజీపీ  ఈ నెల 30 వరకే వాఘా సరిహద్దు తెరిచి ఉంటుందని చెప్పారు. అప్పటి లోగా రాష్ట్రంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు వాఘా సరిహద్దు దాటాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు.. తెలంగాణలో ఉన్న పాకిస్థాన్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో 250 మంది పాకిస్థానీయులు ఉన్నారని పోలీసులు గుర్తించారు.

---------------------------

జమ్ముకశ్మీర్‌లో అమాయకులైన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు హత్య చేయడం అత్యంత దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలశాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలోని పాత బస్టాండ్ కూడలి వద్ద నిన్న నిర్వహించిన మానవహారంలో మాజీ మంత్రి సామినేని  ఉదయభానుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టామని మనోహర్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిన్న 169 మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లెలో 42.9, నంద్యాల జిల్లా గాజులపల్లె, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.5, కర్నూలు జిల్లా లద్దగిరి, ప్రకాశం జిల్లా కొనకనమిట్లలో 42.4, విజయనగరం, అన్నమయ్య జిల్లా వత్తలూరులో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ ప్రభావం కొనసాగుతుందని, ఈ రోజు శ్రీకాకుళం జిల్లా బూర్జ, హీరమండలం, లక్ష్మీనరసుపేట, పాతపట్నం, విజయనగరం జిల్లా సంతకవిటి, మన్యం జిల్లా గురుగుబిల్లి, పాలకొండ మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 28 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

---------------------------

పశుపాలకులకు మార్గదర్శకులుగా.. మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా.. జీవవైవిధ్యంలో కీలక పాత్రపోషించే పశువైద్యుల సేవల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మానవాళికి ప్రత్యక్షంగా ఉపయోగపడే పశువుల ఆరోగ్యానికి పశువైద్యులు, పశువైద్య శాస్త్రవేత్తలు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెలలో చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా నిర్వహించుకుంటాం. మూగజీవాలకు ఆపద్బాంధవులుగా, పశుసంపదను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న పశువైద్యులకు గుర్తింపుగా ఈ రోజు రాష్ట్రంలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తోంది.

=====================